సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 1 । జూన్ । 2023



నకిలీ పత్తి విత్తన విక్రేతల అరెస్ట్
నకిలీ పత్తివిత్తనాలు అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను నల్లగొండ ఎస్పీ వెల్లడించారు. - 8లో



ధాన్యం కొనుగోలు చేయాలని..
ధాన్యం కొనాలని డిమాండ్ చేస్తూ కౌలు రైతు గుండాల తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ఆత్మహత్యకు యత్నించాడు. - 8లో

గరిష్టం/కనిష్టం
42° / 27°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ కళాశాలలు ప్రారంభం

భువనగిరి: కళాశాల విద్యార్థులకు వేసవి సెలవులు మే 31వ తేదీతో ముగిసాయి. దీంతో గురువారం నుంచి జూనియర్ ఇంటర్ కళాశాలలు ప్రారంభం కానున్నాయి. దీంతో విద్యార్థులు తిరిగి కళాశాల బాట పట్టనున్నారు. ఇంటర్ కళాశాలలు ప్రారంభం కావడంతో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు మొదలు కానున్నాయి. జిల్లాలో మొత్తం 72 కళాశాలలకు గాను ఇందులో 11 ప్రభుత్వ కళాశాలలు, 31 సెక్టార్, 30 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలలో సుమారు 6 వేలకుపైగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు.

యాదాద్రీశుడికి లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చనలో శ్రీస్వామి అమ్మవార్లు

యాదగిరిగుట్ట: ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం లక్ష పుష్పార్చన వేడుకలను పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి లక్ష పుష్పార్చన పూజలు చేశారు. తులసీ దళాలతో శ్రీస్వామి అమ్మవార్లను విశేషంగా పూజించారు. ఇక ఆలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలు విశేషంగా జరిపించారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, గజవాహన సేవ, బ్రహ్మోత్సవం, వెండి జోడు సేవలను వైభవంగా నిర్వహించారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్య ఆదాయం రూ.24,74,736 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి టౌన్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తూ దోచుకుంటున్నారన్నారు. ఇలాంటి విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వస్తుపుల అభిలాష్, యశ్వంత్, ప్రకాష్, శివకుమార్ పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

భూదాన్‌పోచంపల్లి: ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కాంగ్రెస్, బీజేపీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని నేతాజీ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కోర్‌కమిటీ కన్వీనర్ భారత లవకుమార్, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సుర్కంటి రంగారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములలో ప్లాట్లుగా చేసి అమ్ముకోవడానికి మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త చిట్టిపోలు శ్రీనివాస్ సహకరించినట్లు ఆడియో రికార్డింగ్ ఆధారాలు ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భోగ భానుమతివిష్ణు, గునిగంటి రమేశ్, మెరుగు శశికళ, గునిగంటి వెంకటేష్, చింతకుంట్ల కృష్ణారెడ్డి, కుక్క కుమార్, కొయ్యడ శ్రీనివాస్, జింకల కుమార్, నల్ల లక్ష్మణ్, చింతకింది రమేశ్, జోగు శ్రీనివాస్, బాబు, రుద్ర చందు, బిట్ల గణేశ్, మద్ది అంజిరెడ్డి, సామల సుధాకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.259కోట్లు.. పెండింగ్

రైతుల ఖాతాల్లో జమకాని ధాన్యం డబ్బులు

- ఇప్పటి వరకు చెల్లించింది రూ.144.11కోట్లే..
- నెల రోజుల నుంచి తప్పని నిరీక్షణ
- త్వరగా వేయాలని అన్నదాతల వేడుకోలు

మంగళవారం వరకు సేకరించిన ధాన్యం వివరాలు..

మొత్తం ధాన్యం కొనుగోలు కేంద్రాలు 307	ధాన్యం అమ్మిన రైతులు 30,396
ప్రభుత్వం కొన్నది 2,81,553.358 మెట్రిక్ టన్నులు	మిల్లులకు తరలించింది 2,65,889.000 మెట్రిక్ టన్నులు
మిల్లులకు తరలించాల్సింది 15,663.798 మెట్రిక్ టన్నులు	రైతులకు ఇవ్వాల్సిన మొత్తం డబ్బులు రూ.403.11 కోట్లు

యాదగిరిగుట్ట రూరల్: కొనుగోలు కేంద్రాల్లో నెల రోజులకుపైగా నిరీక్షించి ధాన్యాన్ని అమ్ముకున్న కొందరు రైతులకు ఖాతాల్లో డబ్బులు జమకాక అష్ట కష్టాలు పడుతున్నారు. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకుని తేమ శాతం లేకుండా పదిహేను రోజులు ఆరబెట్టి, తూర్పార పట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి అమ్ముకున్న రైతులకు ఇంకా నిరీక్షణ తప్పడం లేదు. దీనికితోడు తరుగు పేరుతో కోత విధించి తమ ధాన్యాన్ని కొనుగోలు చేసినప్పటికీ నేటికీ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని వేలాదిమంది రైతులు వాపోతున్నారు. కొనుగోళ్లు చివరి దశకు వచ్చినా, ఇంకా తమకు ధాన్యం పైసలు అందడం లేదని దిగులు చెందుతున్నారు.

నెల రోజులు అవుతున్నా..

గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో దాదాపు 30,396మంది అన్నదాతలు వరి ధాన్యాన్ని విక్రయించారు. మొత్తం 2.81లక్షలకుపైగా మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన ప్రభుత్వం అందుకు సంబంధించి రైతులకు రశీదులు కూడా అందజేయించింది. కొన్నధాన్యంలో ఇప్పటి వరకు 2.65లక్షల మెట్రిక్ టన్నులను మిల్లులకు తరలించారు. మిగతాది లారీల కొరత కారణంగా కొనుగోలు కేంద్రాల్లోనే నిల్వ ఉంది. అయితే ధాన్యం అమ్మి నెల రోజులు గడుస్తున్నా తమ ఖాతాల్లో డబ్బులు ఇంకా పడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా తమ ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరుతున్నారు.



యాదగిరిగుట్ట మండలం మైలార్‌గూడెంలోని కేంద్రంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు



నెల రోజులు అయ్యింది



ఈ సీజన్‌లో 100 క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. నెల రోజులు గడుస్తున్నా డబ్బులు మాత్రం ఖాతాలో జమకాలేదు. డబ్బులు ఎప్పుడు పడతాయో అని ఎదురు చూస్తున్నాను. అధికారులు చొరవ చూపి త్వరగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేసి ఆదుకోవాలి.

– గొట్టిపర్తి మల్లేశం, రైతు, మాసాయిపేట గ్రామం

ఇంకా డబ్బులు జమ కాలేదు



దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో 240 బస్తాల ధాన్యం అమ్మాను. తరుగు పేరుతో కోత కూడా విధించారు. నెల రోజులు పూర్తి కావొస్తున్నా డబ్బులు మాత్రం మా ఖాతాల్లోకి రాలేదు. కేంద్ర నిర్వాహకులు మాత్రం త్వరలోనే జమ అవుతాయని చెబుతున్నారు.

– సోకం మల్లేష్, రైతు, మహబూబ్‌పేట గ్రామం

నిధులు రాక ఆలస్యం అవుతుంది

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన కొందరి రైతులకు సంబంధించి డబ్బులు వారి ఖాతాల్లో జమచేశాం. మరికొంత మంది రైతులకు ధాన్యం డబ్బులు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు రాకపోవడంతో కొంత ఆలస్యం అవుతుంది. త్వరలోనే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ అవుతాయి.

– గోపి కృష్ణ, సివిల్ సప్లయ్ మేనేజర్, యాదాద్రి భువనగిరి జిల్లా

రైతులను ఇబ్బంది పెడితే కేసులు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ పమేలా సత్పతి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ధాన్యం కొనుగోళ్లపై వాడివేడిగా చర్చ
- యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోండి
- జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఉద్దేశపూర్వకంగా రైతులను ఇబ్బందులకు గురిచేసే రైస్ మిల్లర్లపై కేసులు నమోదు చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అధికారులను అన్నారు. భువనగిరిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి అధ్యక్షతన జెడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సభలో సభ్యుల మధ్య వాడివేడి చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ కుడుదుల నగేష్ మాట్లాడుతూ 50 రోజులుగా రైతులు ధాన్యాన్ని మార్కెట్ యార్డులో అమ్మకానికి పెట్టినప్పటికి ఇప్పటివరకు కొనుగోలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ అనుబంధ శాఖలు పంట దిగుబడిపై అంచనా వేయకపోవడంపై కారణం చెప్పాలని నిలదీశారు. సివిల్ సప్లయ్ డీఎం గోపికృష్ణ సమాధానం చెబుతూ ఏప్రిల్ 21న ధాన్యం కొనుగోలుకేంద్రాలు ప్రారంభించినప్పటికీ కొంత ఆలస్యం జరిగిందని, గత సీజన్‌లో కొనుగోలు చేసినవి మిల్లర్ల వద్ద ఉండడంతో కొంత ఆలస్యం జరిగిందన్నారు. ఇప్పటికీ 2.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇంకా లక్ష మెట్రిక్ ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. అలాగే బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న లప్పానాయక్ తండా, చోక్లానాయక్‌తండా నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని డాక్టర్ నగేష్ కోరారు. లప్పానాయక్‌తండాకు ప్యాకేజీ నిధులు మంజూరయ్యాయని, చోక్లానాయక్ తండాకు ప్రాసెస్‌లో ఉన్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని నగేష్..కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ నీటిలో కోడి ఈకలు వచ్చిన నీటిని బాటిల్‌లో కలెక్టర్, అధికారులకు చూపించారు.

ధాన్యం కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగానే ఉన్నాం : కలెక్టర్

కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో కొంత ఆలస్యం జరిగినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగానే ఉందన్నారు. రైతులకు రూ.142 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సీజన్‌లో ధాన్యం దిగుబడి పెరిగిందన్నారు. జిల్లాలో కేవలం 37 మిల్లులు మాత్రమే ఉన్నాయన్నారు. 400 లారీలతో ధాన్యాన్ని మిల్లర్లకు తరలిస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని అడిగితే ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు.

నీరా ఉత్పత్తులేంటి?

భువనగిరి మండలం నందనం గ్రామంలో ఏర్పాటు చేసిన నీరా ప్రాజెక్టులో ఎలాంటి ఉత్పత్తులు ఉంటాయో తెలపాలని పలువురు సభ్యులు ప్రశ్నించారు. దీంతో ఎక్సైజ్ ఈఎస్ నవీన్ కుమార్ మాట్లాడుతూ నీరాతో పాటుగా, పటిక బెల్లం, చాక్లెట్లు తయారు చేస్తారని తెలిపారు. నెల రోజుల్లో నీరా ప్రాజెక్టును ప్రారంభిస్తామన్నారు. భువనగిరి, యాదగిరిగుట్ట ఎంపీపీలు నిర్మల, శ్రీశైలం మాట్లాడుతూ గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఉదయం ఐదు గంటలకే బెల్ట్ షాపులు తెరవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్టలో మద్యానికి బానిసై ఇటీవలనే ఇద్దరు యువకులు చనిపోయినట్లు తెలిపారు. చౌటుప్పల్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని, డ్రగ్స్‌ను నిరోధిస్తూ, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సమావేశం ఎజెండా తయారీ తప్పులు తడకగా ఉంటుందని నగేష్ ఆరోపించారు. ఇంటర్ ఫలితాల్లో హరినాథ్, కీర్తికి 100 మార్కులకు 980, 979 మార్కులు వచ్చినట్లు ఇచ్చారని, 1000 మార్కులు నమోదు చేయాలి కాని 100 మార్కులేంటని ప్రశ్నించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.



సమావేశానికి తక్కువ సంఖ్యలో హాజరైన జెడ్పీటీసీ సభ్యులు

డిపో మేనేజర్‌పై ఆగ్రహం

యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్ తీరుపై సమావేశంలో పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ సమావేశాలకు రావపోవడంతపాటు కనీసం నివేదిక పంపించపోవడంపై జెడ్పీ చైర్మన్ కూడా ఆగ్రహించి వెంటనే అతడికి మెమో జారీ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జెడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీలు సబ్బూరు బీరుమల్లయ్య, తోటకూర అనురాధ, శ్రీరాముల జ్యోతి, పల్లా వెంకట్‌రెడ్డి, జిల్లా అధికారులు గోపికృష్ణ, సునంద, లక్ష్మణ్, కృష్ణ, వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్, అన్నపూర్ణ, అనురాధ, జైపాల్‌రెడ్డి తోపాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా 10 మంది జెడ్పీటీసీలు హాజరుకాలేదు.

సీఎం కప్ ఖోఖో విజేతగా జిల్లా మహిళా జట్టు



జిల్లా జట్టుకు ట్రోఫీ అందించి విజయ సంకేతం చూపుతున్న మంత్రి మల్లారెడ్డి

భువనగిరి: సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా మహిళా జట్టు మొదటి స్థానం దక్కించుకుని విజేతగా నిలిచింది. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో బుధవారం జరిగిన ఖోఖో ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుపై జిల్లా జట్టు ఘన విజయం సాధించి రాష్ట్ర స్థాయి సీఎం కప్‌ను కైవసం చేసుకుంది. జట్టు సభ్యులకు మంత్రి మల్లారెడ్డి ట్రోఫీ అందజేసి అభినందించారు. ఖోఖో మహిళా విభాగంలో రాష్ట్రస్థాయిలో జిల్లాకు మొదటి స్థానం సాధించడం పట్ల జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కె.ధనుంజయ్య, సెక్టోరియల్ అధికారి ఎస్.అండాలు, ఎస్ జీఎఫ్ సెక్రటరీ స్టాలీన్‌బాబు, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాతి కృష్ణామూర్తి, ఖోఖో మహిళా కోచ్ జ్ఞానేశ్వరి, లైజనింగ్ ఆఫీసర్ శ్రీశైలం, పీఈటీలు నరసింహ, రమేష్‌రెడ్డిలు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

మళ్లీ.. తడిసిన ధాన్యం

గుండాల: మండలంలో బుధవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో మళ్లీ ధాన్యం తడిసి ముద్దయింది. తూకం వేసిన బస్తాలు కూడా తడిసి పోయాయి. కొన్ని చోట్ల చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. మరికొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు కూలి నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వరుసగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని, తూకం వేసిన బస్తాలను తక్షణమే మిల్లులకు తరలించాలని వేడుకుంటున్నారు.



గుండాలలో తడిసిన ధాన్యం బస్తాలు

మొదటి రోజే యూనిఫామ్

- ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం నాడే విద్యార్థులకు పంపిణీ
- ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసిన విద్యాశాఖ
- 60శాతం కుట్టుపని పూర్తి
- మొత్తం 55,847 మంది విద్యార్థులు



భువనగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభమైన రోజే యూనిఫామ్స్ అందించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. యూనిఫామ్ తయారీ కోసం 2.75 లక్షల మీటర్ల క్లాత్ జిల్లాకు చేరింది. అధికారులు టెండర్లు నిర్వహించి కొన్ని సంస్థలకు యూనిఫామ్ తయారీకి అందజేశారు. వివిధ సంస్థలతోపాటు స్థానికంగా ఉన్న టైలర్లకు యూనిఫామ్ కుట్టడానికి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందజేశారు. జూన్ 12లోపు యూనిఫామ్ సిద్ధం చేయాలని ఆయా సంస్థలకు టైలర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు 60 శాతం మేర యూనిఫామ్స్ కుట్టడం పూర్తయినట్టు అధికారులు పేర్కొంటున్నారు. అయితే అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో యూనిఫామ్ తయారీలో రాష్ట్రంలోనే మూడవ స్థానంలో ఉంది.

జిల్లాలో 55,847 మంది విద్యార్థులకు..

జిల్లాలో 712 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలో మొత్తం 55,847 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికి జూన్ 12 వరకు యూనిఫామ్స్ అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున యూనిఫామ్‌ను అందజేయనున్నారు.

మారిన యూనిఫామ్ డిజైన్

గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం విద్యార్థుల యూనిఫామ్ డిజైన్ కొత్తగా మార్పు చేశారు. ప్రైమరీ స్కూల్, హైస్కూల్ విద్యార్థులకు వేర్వేరుగా డిజైన్‌లు కలిగిన యూనిఫామ్స్ పంపిణీ చేస్తారు. అలాగే, ఆదర్శ పాఠశాలలు, కస్తూరిబాగాంధీ విద్యాలయాల్లో చదివే ఇంటర్ విద్యార్థులకు మరో రకమైన యూనిఫామ్ డిజైన్ తయారు చేస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు దీటుగా ఉండేలా ప్రభుత్వ విద్యార్థులకు యూనిఫామ్స్ సిద్ధం చేస్తున్నారు.

పాఠశాలలు ప్రారంభం రోజే పంపిణీ చేస్తాం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ యూనిఫామ్ అందిస్తాం. ఇప్పటికే జిల్లాలో 60 శాతం వరకు కుట్టడం పూర్తయింది. మిగిలిన యూనిఫామ్స్ సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్ణీత తేది ప్రకారం విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేస్తాం.

– ప్రశాంత్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ ఏడీ

అభివృద్ధిని చూసే ప్రజలు పట్టం కడతారు

- భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- పోచంపల్లిలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన ఎమ్మెల్సీ యాదవరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కంచర్ల తదితరులు

భూదాన్‌పోచంపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసే వచ్చే ఎన్నికల్లో కూడా ప్రజలు మళ్లీ పట్టం కడతారని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్‌హాలులో ఉదయం గ్రామాలు, మధ్యాహ్నం మున్సిపల్ పట్టణ బీఆర్‌ఎస్ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రైతులు, మహిళలు, కులవృత్తులు, మైనార్టీలు, దళితులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ఆదుకొన్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనం ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధించేలా కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు, పట్టణాలు చాలా అభివృద్ధి సాధించాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ కె.భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షురాలు బత్తుల మాధవి శ్రీశైలంగౌడ్, రావుల శేఖర్‌రెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల, పట్టణ శాఖ అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం, ప్రధాన కార్యదర్శులు చిల్వేరు బాలనర్సింహ, బందారపు లక్ష్మణ్, గునిగంటి మల్లేశ్, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, మార్కెట్‌కమిటీ డైరెక్టర్లు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



హాజరైన కార్యకర్తలు, నాయకులు

అన్నదాతలను అరెస్ట్ చేయడం దారుణం

భువనగిరి: రైతులను అరెస్ట్ చేయడం దారుణమని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు మంగళవారం భువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసిన సందర్భంగా అరెస్ట్ చేసి కోర్టు ఆవరణంలోని జైలులో ఉంచగా బుధవారం ఆయన వెళ్లి పరామర్శించారు. అనంతరం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రీజినల్ రింగ్ రోడ్డు బాధితులను ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి వద్దకు రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులను తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు కృష్ణ, సలావుద్దీన్, విద్యాసాగర్, ఎంపీపీ రమేష్‌రాజు, సత్తిరెడ్డి, పాశం శివానంద్, వెంకటేష్, రఘుబాబు, నాగరాజు, మల్లారెడ్డి, శ్రీనివాస్, స్వామి, రైతులు ఉన్నారు.



జైలులో ఉన్న రైతులను కలిసి వస్తున్న డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

క్లుప్తంగా

యువతి, యువకుడు అదృశ్యం

రామన్నపేట : మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన ఓ యువతి, యువకుడు అదృశ్యమయ్యారు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నీర్నెముల గ్రామానికి చెందిన నోముల పల్లవి నార్కట్‌పల్లిలోని నర్సింగ్ కళాశాలలో ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తోంది. ఈ నెల 30న కళాశాలకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆమె కోసం బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో తండ్రి నోముల శంకరయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఇదే గ్రామానికి చెందిన చిప్పలపల్లి వెంకటేష్ ఈనెల 30న ఉదయం 10 గంటల సమయంలో పని మీద వెళ్తున్నాని భార్యతో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఇద్దరి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి


దిలీప్ (ఫైల్)

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన జూలూరి గంగాచారి, నాగమణి దంపతుల కుమారుడు జూలూరి దిలీప్ (25) ఇటీవల వడదెబ్బకు గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఉదయం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విష ప్రయోగమా.. ఎండతీవ్రతా ?


మృతి చెందిన చేపలు

మోతె : వ్యవసాయ క్షేత్రంలో రైతు పెంచుతున్న చేపలు బుధవారం మృతిచెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం గ్రామానికి చెందిన రైతు యల్లయ్య తన వ్యవసాయ క్షేత్రంలో సుమారుగా 1.30 కుంటల విస్తీర్ణం గల చెరువులో 8 నెలల క్రితం 20 వేల చేప పిల్లలను పోసి పెంచుతున్నాడు. చేపలు సుమారుగా 500 గ్రాముల నుంచి కేజీ సైజు వరకు ఉన్నాయి. ఉన్నట్లుండి బుధవారం ఉదయం ఒకేసారిగా చెర్వులో చేపలన్నీ మృత్యువాత పడ్డాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆక్సిజన్ అందక మృత్యువాత పడ్డాయా లేదా ఎవరైన విష ప్రయోగం చేశారా అని రైతు అనుమానం వ్యక్తం చేశాడు. మృతిచెందిన చేపను పాలేరు ఫిషరీ ల్యాబ్‌కు పంపించారు.

ప్రైవేట్ ఆస్పత్రుల నకి'లీలలు' !

- నకిలీ బిల్లులతో సీఎం సహాయ నిధి స్వాహా
- మిర్యాలగూడ కేంద్రంగా సాగుతున్న దందా
- గతంలో మహేష్ ఆస్పత్రిలో రూ.455కోట్ల కుంభకోణం
- తాజాగా నవీన ఆస్పత్రి నుంచి 21నకిలీ బిల్లుల గుర్తింపు
- వాస్తవాలు నిగ్గుతేల్చేందుకు సీఐడీ అధికారుల సమగ్ర దర్యాప్తు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడలోని కొని ప్రైవేట్ ఆస్పత్రులు నయా దందాకు తెరలేపాయి. రోగులకు వైద్య పరీక్షలు చేయకున్నా నకిలీ బిల్లులు సృష్టించి సీఎం సహాయ నిధిని స్వాహా చేసేందుకు అడ్డదారులు తొక్కుతున్నాయి. గత ఏప్రిల్ నెలలో మిర్యాలగూడ పట్టణానికి చెందిన మహేష్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో రూ.4.55 కోట్ల కుంభకోణం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. దీంతో మిర్యాలగూడ ప్రాంతం నుంచి వచ్చే ప్రతి బిల్లును సంబధిత రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగా నవీన మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకులు జారీ చేసిన నకిలీ బిల్లులను గుర్తించిన ప్రభుత్వం సీఐడీ అధికారులను రంగంలోకి దింపినట్లు తెలిసింది. దీంతో వారు వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు నకిలీ బిల్లుల వ్యహారంపై విచారణ చేపట్టినట్లు తెలిసింది.

కొరవడిన అధికారుల నిఘా

ఆస్పత్రుల నిర్వాహకులు నకిలీ బిల్లులు తయారు చేసి వాటిపై వైద్యుల సంతకాలు ఫోర్జరీ చేసి నిధులు కాజేస్తున్నారు. ఈ తరహా వ్యవహారం గతంలోనే వెలుగులోకి వచ్చినప్పటికీ జిల్లా అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు యథేచ్ఛగా నకిలీ బిల్లులు తయారు చేసి ఏకంగా ముఖ్యమంత్రి సహాయ నిధులపై కన్నేసి కాజేస్తున్నారు. కాగా, గతంలో సీఎంఆర్ఎఫ్ నిధులు కాజేసిన మహేష్ ఆస్పత్రి నిర్వాహకులు ఏపీ రాష్ట్ర గుంటూరు మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్‌కుమార్ సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ బిల్లులు కాజేశారు. దీంతో సదరు వైద్యుడు ఆస్పత్రి నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మహేష్ ఆస్పత్రి నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. తాజాగా నవీన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకులు సైతం వైద్యుల సంతకాలు ఫోర్జరీ చేసినట్లు సీఐడీ అధికారులు అనుమానిస్తున్నారు. వైద్యధికారుల నిఘా లేకపోవడంతోనే ప్రైవేట్ ఆస్పత్రుల మెడికల్ దందాకు ఊతమిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కొందరు వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రులకు సహకరిస్తూ నకిలీ బిల్లులో వచ్చే డబ్బుల్లో పర్సెంటీజీలు పొందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వైద్యుల పాత్రపై అనుమానాలు

మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని నాగార్జునసాగర్, మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు కొందరు కొంత కాలంగా నవీన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో విజిటింగ్ డాక్టర్లుగా పని చేస్తున్నారు. అయితే ఈ ఆస్పత్రిలో 21 మంది రోగులకు ఖరీదైన వైద్యం చేసినట్లుగా లక్షల్లో బిల్లులను ఇచ్చారు. ఈ బిల్లులపై ఓ డాక్టర్ నాలుగు బిల్లులపై, మరో డాక్టర్ 17 బిల్లులపై సంతకాలు చేశారు. ఈ ఆస్పత్రిలో అత్యంత ఖరీదైన వైద్యం అందించే సదుపాయాలు లేకున్నా లక్షల్లో బిల్లులు ఇవ్వడంపై సీఐడీ అధికారులు తప్పు బట్టినట్లు సమాచారం. దీంతో ఆస్పత్రి నిర్వాహకులు జారీ చేసిన బిల్లులు సుమారు కోటి రూపాయలకు పైగా ఉండడంతో సమగ్ర విచారణ చేపట్టారు. దీంతో ఆస్పత్రిలో విజిటింగ్ డాక్టర్లుగా పని చేస్తున్న వైద్యుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా నకిలీ బిల్లులు జారీ చేసిన నవీన మల్టీ స్పెషాలిటీ లో వైద్యులను ఇప్పటికే విచారించిన సీఐడీ అధికారులు తాజాగా ఆస్పత్రి నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం.

కులవృత్తులకు జీవం పోసిన సీఎం కేసీఆర్

- మంత్రి జగదీశ్‌రెడ్డి


సూర్యాపేటలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మేదరి సంఘం నాయకులు

భానుపురి (సూర్యాపేట): 2014 కు ముందు అచేతనంగా మారిన కుల వృత్తులకు సీఎం కేసీఆర్ జీవం పోశారని మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేటలోని క్యాంప్ కార్యాలయంలో ఆయనను సూర్యాపేట జిల్లా మేదర సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కులవృత్తిదారులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కుల వృత్తులకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రమిస్తోందని, అందులో భాగంగానే వృత్తిదారులకు రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందించాలని నిర్ణయించిందని చెప్పారు. ఇప్పటికే మేదరులకు వెదురుతో గృహాలంకరణ వస్తువుల తయారీపై ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇప్పించిందన్నారు. కొద్ది మందికి రుణాలను కూడా మంజూరు చేసిందని, అదేరీతిన మిగతా కులవృత్తుల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తుందన్నారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, మేదర సంఘం ప్రతినిధులు యాదగిరి, మల్లయ్య, తిరుపతయ్య, వెంకన్న, మల్లేశం, వెంకన్న తదితరులున్నారు.

పిడుగుపాటుతో ఎద్దు మృతి

గుండాల : పిడుగుపాటుకు గురై ఎద్దు మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని మరిపడిగ గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన కొండబోయిన మంకయ్యకు చెందిన కాడెద్దులను వ్యవసాయ బావి వద్ద మేపుతున్నాడు. ఈ క్రమంలో పిడుగు పడటంతో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. సుమారుగా రూ.60 వేల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె, దూడ ..

చౌటుప్పల్ : మండల పరిధిలోని జైకేసారం గ్రామానికి చెందిన సమిరెడ్డి రాంరెడ్డి రైతుకు చెందిన గేదె, దూడ బుధవారం జరిగిన విద్యుదాఘాతంతో మృతిచెందాయి. తన వ్యవసాబావి వద్ద విద్యుత్ వైరుకు తగలడంతో గేదె, దూడ అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారుగా లక్ష రూపాయల వరకు నష్టం జరిగినట్లు రైతు వాపోయాడు.

ఇద్దరు నకిలీ పత్తి విత్తన విక్రేతల అరెస్ట్

- రూ.10లక్షల విలువైన విత్తనాలు స్వాధీనం


నకిలీ విత్తన ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 10లక్షల విలువైన 10క్వింటాళ్ల 45 కేజీల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 444 ప్యాకెట్లు(2క్వింటాళ్లు) ఉన్నాయి. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అపూర్వరావు వెల్లడించారు. మునుగోడు పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో బస్టాండ్ వద్ద నంద్యాల జిల్లా ఆల్లగడ్డ తాలూకాకు చెందిన కర్నాటి మధుసూదన్ రెడ్డి, తూర్పు గోదావరి జిల్లా తాళ్లూరు మండలం గండెపల్లి గ్రామానికి చెందిన గురిజాల వీరబాబు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీలు చేయగా విత్తన ప్యాకెట్లు ఉన్నాయి. వ్యవసాయ అధికారులతో విచారించగా నకిలీ విత్తన ప్యాకెట్లుగా గుర్తించారు. వెంటనే సమగ్రంగా విచారించగా కొంత కాలంగా నంద్యాల పరిసర ప్రాంతాల్లో రైతుల నుంచి తక్కువ ధరకు విత్తనాలు కొనుగోలు చేసి గుంటూరుకు తరలించి హరికృష్ణా రెడ్డికి చెందిన పాత మిల్లులో రంగులు,రసాయనాలు పూసి ఎలాంటి గుర్తింపు లేని సూర్యాసీడ్స్, మేఘనా, అరుణోదయ పేరిట మొత్తం 10 ప్యాకెట్లు తీసుకొని మునుగోడులో నేరుగా రైతులకు, విత్తన డీలర్లకు అమ్మేందుకు చూశారు. నేరస్తులు ఇచ్చిన సమాచారంతో హరికృష్ణా రెడ్డికి చెందిన పాత మిల్లునుంచి మిగిలిన పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నకిలీ విత్తనాలు నేరుగా రైతులు, విత్తన డీలర్లకు అమ్మేందుకు ప్రయత్నించిన కర్నాటి మధుసూదన్, గురిజాల వీరబాబులను అరెస్టు చేయగా హరికృష్ణారెడ్డి పరారీలో ఉన్నట్లు తెలిపారు. గతంలో మధుసూదన్ రెడ్డిపై పీడీయాక్టు నమోదు అయినట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్ఐ సతీష్‌రెడ్డి ఎస్పీ అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపురం శివారులోని తుర్కగూడెం రోడ్డులో సుమారు 60–65ఏళ్ల వయసు గల వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని వెళ్లారు. పరిసరాలు పరిశీలించారు. భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఫిట్స్, లేదంటే ఇతర అనారోగ్య కారణాలతో చనిపోయి ఉండొచ్చునని భావిస్తున్నారు. ఎస్ఐ సీతపాండు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి..

దేవరకొండ : అనుమానాస్పద స్థితిలో ఓ యువతి మృతిచెందింది. ఈ ఘటన దేవరకొండ మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సతీష్ తెలిపిన ప్రకారం.. దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొత్రతండాకు చెందిన నేనావత్ మాన్‌సింగ్ దంపతుల చిన్న కుమార్తె చిన్ని(18) పదవ తరగతి పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. అదే తండాకు చెందిన విజయ్ కొంతకాలంగా ప్రేమపేరుతో యువతి వెంట పడుతున్నాడు. కాగా, ఇటీవల చిన్ని తల్లిదండ్రులు వివాహం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 29న ఇంటి నుంచి బయటికి వెళ్లిన చిన్ని తండా సమీపంలోని వ్యవసాయ బావిలో బుధవారం విగతజీవిగా కనిపించింది. గమనించిన పశువుల కాపర్లు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తన కుమార్తెమృతికి విజయ్ కారణమంటూ అనుమానం వ్యక్తం చేస్తూ యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులపై నాన్ బెయిలబుల్ కేసు

భువనగిరి : రీజినల్ రింగ్‌రోడ్డులో భూములు కోల్పోతున్న రాయగిరి భూ నిర్వాసితులైన నలుగురు రైతులపై పోలీసులు బుధవారం నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ రాయగిరి భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. అదే విధంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సమయంలో కలెక్టరేట్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష సమావేశంలో ఉన్న మంత్రి జగదీశ్‌రెడ్డి బయటకు వచ్చే క్రమంలో కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీయడంతో పోలీసులు రైతులను అరెస్ట్ చేసి తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయడం, రోడ్డుపై గుంపుగుంపులుగా ఉండడం, మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకోవడం, విధులకు ఆటంకం కలిగించడంతో ఐపీసీ 147, 148, 341, 427, 353 సెక్షన్ల కింద రైతులు గడ్డమీది మల్లేష్, పల్లెర్ల యాదగిరి, అవుశెట్టి నిఖిల్, మల్లెబోయిన బాలనర్సింహపై కేసు నమోదు చేసి భువనగిరి కోర్టు ఆవరణంలోని జైలు రిమాండ్‌కు తరలించారు. వారితో పాటు మరో ఇద్దరు పరారీలో ఉండడంతో పాటు ఇతరులపై కేసు నమోదు చేయనున్నారు.

యాదాద్రిలో నమ్మాళ్వార్ తిరునక్షత్ర వేడుకలు


ఆలయంలో దివ్య ప్రబంధ పారాయణం చేస్తున్న పారాయణీకులు, ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం రాత్రి నమ్మాళ్వార్ తిరునక్షత్ర వేడుకలకు ఆచార్యులు తొలక్కంతో శ్రీకారం చుట్టారు. ఆలయ ముఖ మండపంలో నమ్మాళ్వార్లను ప్రత్యేకంగా అలంకరించి, అనంతరం దివ్య ప్రబంధ పారాయణాన్ని పారాయణీకులు, ఆచార్యులు పఠించారు. అనంతరం సేవకాలం నిర్వహించారు. మూడురోజుల పాటు ఆలయంలో నమ్మాళ్వార్ తిరునక్షత్ర వేడుకలు జరగనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

ఆలయ పరిచారకుడికి చార్జ్ మెమో..

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో పరిచారకుడి (అర్చకుడి)గా విధులు నిర్వహిస్తున్న రామాచారికి ఆలయ ఈఓ గీతారెడ్డి చార్జ్ మెమోలు ఇచ్చారు. శ్రీస్వామి వారి ఆలయానికి వచ్చిన భక్తులకు కంకణాలు కట్టి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఈఓకు భక్తులు ఫిర్యాదు చేశారు. దీంతో వారి ఫిర్యాదు మేరకు పరిచారకుడికి ఆలయ ఈఓ చార్జ్‌మెమోలను జారీ చేశారు. మరో సారి డబ్బులు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం.

శ్రీస్వామిని దర్శించుకున్న రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి


వాకాటి కరుణ దంపతులకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి రాజన్‌బాబు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని, సువర్ణ పుష్పార్చన ఉత్సవమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న కరుణ దంపతులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయాధికారి రాజన్‌బాబు లడ్డూ ప్రసాదం అందజేశారు.

ధాన్యం కొనుగోలు చేయాలని..

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట కౌలు రైతు ఆత్మహత్యాయత్నం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని మాట్లాడుతున్న ప్రవీణ్

గుండాల : వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఓ కౌలు రైతు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గుండాలకు చెందిన అన్నెపర్తి ప్రవీణ్ గ్రామంలో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. కోసిన పంటను 20రోజుల క్రితం స్థానిక ఐకేపీ సెంటర్‌కు తరలించాడు. లారీల సాకు చూపి రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని ప్రవీణ్ మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు బాటిల్‌లో పెట్రోల్ తీసుకుని వచ్చి ఒంటిపై పోసుకున్నాడు. నిప్పు అంటించుకునేలోపే రెవెన్యూ సిబ్బంది గమనించి అడ్డుకున్నారు. విషయం తెలుసుకుని తహసీల్దార్ జ్యోతి కార్యాలయం నుంచి బయటికి వచ్చి ధాన్యాన్ని తూకం వేసి మిల్లుకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ప్రవీణ్ ఇంటికి వెళ్లిపోయాడు.

ఆంధ్రా నుంచి మట్టపల్లికి ఆర్టీసీ సేవలు


మట్టపల్లి క్షేత్రానికి వచ్చిన పల్నాడు జిల్లా పిడుగురాళ్ల డిపో బస్సు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి భక్తుల సౌకర్యార్థం ఆంధ్రాలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్ల డిపో నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులను అధికారులు ప్రారంభించారు. బుధవారం మట్టపల్లి క్షేత్రానికి చేరుకున్న బస్సును మట్టపల్లి ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, చెన్నూరు మట్టపల్లిరావు పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. పవిత్ర మట్టపల్లి క్షేత్రానికి ఆంధ్రా భక్తులు నదిని దాటి పడవల్లో రావడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారని, ఇటీవల ఏర్పాటైన బ్రిడ్జితో ఎట్టకేలకు ఆంధ్రా ప్రభుత్వం ఆర్టీసీ బస్సు సర్వీసులు క్షేత్రానికి నడపడం హర్షణీయమన్నారు. తెలంగాణ ఆర్టీసీ అధికారులు గతంలో నడిపిన బస్సులను భక్తుల సౌకర్యార్థం పునరుద్ధరించాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంద కృష్ణ మాదిగ

మునగాల(కోదాడ): భారత రాజ్యాంగ సృష్టికర్త డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. బుధవారం మండలంలోని గణపవరంలో ఏపీజేబీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రొ.ఖాసీం, భరత్‌భూషణ్, సూరేపల్లి సుజాతలతో కలసి ఆవిష్కరించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన విగ్రహాల నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన శ్రీగౌతమబుద్ధ, జ్యోతిబాపూలే, జగ్జీవన్‌రామ్, డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం సూరేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పలువురు వక్తలు మాట్లాడారు. సమాజ హితం కోసం సర్వ సుఖాలను త్యాగం చేసిన మహోన్నతుడు గౌతమబుద్ధుడని కొనియాడారు. మానవ వికాసానికి హేతుబద్ధమైన గొప్ప జీవన మార్గాన్ని ఆయన ప్రపంచానికి అందించారని కొనియాడారు. చదువుతోనే పురోగతి సాధ్యమవుతుందని మొదట గుర్తించింది పూలే అని వారు గుర్తు చేశారు. విపత్కర పరిస్థితులను అధిగమించి ఉన్నతికేగిన రత్నాలలో బాబు జగ్జీవన్‌రామ్ ఒకరు అని కొనియాడారు. అంబేడ్కర్ కలలుగన్న భారతదేశంలో భిన్నత్వంతో కూడిన ప్రత్యేక ప్రజాస్వామిక లక్షణాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్ కేతిరెడ్డి జితేందర్‌రెడ్డి, బండారు సైదులు, పోడేటి చంద్రయ్య, బచ్చలకూరి జార్జి, అంజయ్య, ఎం.వెంకయ్య, మనోజ్‌కుమార్, రమేష్, జాన్‌విల్సన్, ఏ.రాజు, ఎల్.శ్రీనివాస్, నెమ్మాది శ్రీనివాసరావు,ఏపూరి రాజు, ఆజంజేయులు పాల్గొన్నారు.

రైలు పట్టాల పక్కన విగతజీవిగా వ్యక్తి..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఆలేరురూరల్ : రైలు పట్టాల పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆలేరులో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు రైల్వేస్టేషన్ ఎగువ మార్గంలో లూప్‌లైన్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి రైల్వేపోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో భువనగిరి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.సత్యనారాయణ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, ఇతను సహజంగా లేదా వడదెబ్బకు గురై మృతిచెంది ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నామన్నారు. మృతుడు సుమారు 55 సంవత్సరాల వయసు ఉంటుందని లేత ఆకుపచ్చ టీషర్టు, పింక్ రంగు పొట్టి నిక్కర్ ధరించి ఉన్నాడని చెప్పారు. ఇతను మంగళ, బుధవారాల్లో స్థానిక రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలపై తిరిగినట్లు రైల్వే క్వార్టర్లలో భిక్షాటన చేసినట్లు తెలిసిందన్నారు. ఇతను బిహార్ లేదా ఒడిశాకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటి పైనుంచి పడి ఒకరు..

కోదాడరూరల్ : ఇంటి పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని టీచర్స్ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టీచర్స్ కాలనీలో నివాసం ఉండే బదావత్ బాలాజీ(45)తన రెండంతస్తుల సొంతింటిపై మరమ్మతులు చేయిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలై మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య జయకుమారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీత్లాతండాలో విషాదఛాయలు

చిలుకూరు: ఇంటి పైనుంచి పడి మృతిచెందిన బాలాజీ కాంగ్రెస్ పార్టీ చిలుకూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఆయన మృతిచెందడంతో స్వగ్రామం చిలుకూరు మండలం సీత్లాతండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బాలాజీ మృతికి కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆలయ పునర్నిర్మాణంలో ఇరుపక్షాల వాగ్వాదం

హుజూర్‌నగర్ రూరల్ : రామాలయం పునఃనిర్మాణం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు సవాలుగా మారింది. వివరాల ప్రకారం.. మండలంలోని కరక్కాయలగూడెంలో రామాలయం పునర్నిర్మాణం విషయంలో సంవత్సరం కాలంగా ఇరుపార్టీల మధ్య వివాదం నెలకొని తారాస్థాయికి చేరింది. ఈనెల 29న గ్రామానికి చెందిన దాత, గ్రామస్తుల సహకారంతో రామాలయం పునఃనిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రయత్నించారు. కాగా కాంగ్రెస్ పార్టీ వర్గం వారు మా మద్దతు లేకుండా మీరు ఎలా ఆలయ పునర్నిర్మాణం చేపడతారంటూ ఆలయంలో ఒకరికొక్కరూ వాగ్వాదం చేసుకుని తోపులాటకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు కల్పించుకొని ఇరుపార్టీల వారికి నచ్చజెప్పడంతో ఆరోజుకు వివాదం సద్దుమనిగింది. కాగా బుధవారం మళ్లీ ఈ విషయం తెరపైకి వచ్చింది. ఎలాగైనా పాతగుడిని తొలగించి నూతన నిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ వర్గానికి చెందిన సభ్యులు ప్రయత్నించగా కాంగ్రెస్ వారు ఎలా నిర్మాణం చేపడతారో చూస్తాం అంటూ ఆలయం వద్ద భారీగా చేరారు. దీంతో గ్రామస్తులు, ఇతర పెద్దల సూచనల మేరకు ఇరుపక్షాల వారు ప్రస్తుతం ఆలయ పునర్నిర్మాణం విషయం వాయిదా వేశారు. ఈ విషయంపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్ కీత జయమ్మధనమూర్తిని సంప్రదించగా.. బీఆర్ఎస్ పార్టీ దాతల సహకారంతో ఆలయం పునఃనిర్మాణం చేపడితే కాంగ్రెస్ సభ్యులు గ్రామంలో తమ ఉనికిని కోల్పోతారనే ఉద్దేశంతో ఆలయం నిర్మాణం చేపట్టనివ్వడంలేదని ఆరోపించారు. ఇదే విషయమై కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ దొంగరి అరుణసత్యనారాయణ సంప్రదించగా.. గ్రామంలో ఆలయ పునర్నిర్మాణానికి బలమైన సుముహూర్తం లేకపోవడంతో ప్రస్తుతం జేష్ఠ మాసం ఉన్నందున వచ్చే శ్రావణమాసంలో ఆలయ నిర్మాణానికి బలమైన సుముహూర్తం చూసి ఆలయ నిర్మాణం చేపడితే తాము సహకర్తిమని, ఎలాంటి వివాదం లేకుండా దాతల సహకారంతో ముందుకు వెళ్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇరు పార్టీలకు చెందిన సభ్యులు డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వర్లు, కీత కృష్ణమోహన్, కీత వీరబాబు, పిల్లుట్ల వీరయ్య, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

అడ్లూరు ఉపసర్పంచ్‌పై నెగ్గిన అవిశ్వాసం

కోదాడరూరల్ : మండల పరిధిలోని అడ్లూరు గ్రామ ఉపసర్పంచ్ లచ్చిరెడ్డిపై పలువురు వార్డు సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. అవిశ్వాసం పెట్టిన ఆయన వ్యతిరేక వర్గం వారు తమ పంతాన్ని నెగ్గించుకున్నారు. గ్రామసర్పంచ్ స్వరాజ్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఉపసర్పంచ్‌గా ఉన్న లచ్చిరెడ్డి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించడం ఇష్టం లేని వ్యతిరేక వర్గం వారు ఆయనపై ఆవిశ్వాసం ఏర్పాటు చేయాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గత నెల 17న అవిశ్వాసం ఏర్పాటు చేసినా ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో అవిశ్వాసాన్ని బుధవారానికి వాయిదా వేశారు. దీంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవిశ్వాస తీర్మానానికి సరైన కోరం ఉండడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీఓ కిశోర్‌కుమార్ ప్రకటించారు. నూతన ఉపసర్పంచ్ ఎన్నిక ఎప్పుడు నిర్వహిస్తారనే విషయాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెలపనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పంతం నెగ్గించుకున్న వ్యతిరేక వర్గం వార్డుసభ్యులు..

గ్రామంలో 8మంది వార్డు సభ్యులుండగా లచ్చిరెడ్డికి ముగ్గురు మద్దతు తెలపగా, ఐదుగురు సభ్యులు వ్యతిరేకంగా మద్దతు తెలిపారు. దీంతో ఉపసర్పంచ్‌గా ఉన్న లచ్చిరెడ్డికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన అవిశ్వాసం నెగ్గిందని ఆర్డీఓ తెలిపారు. అవిశ్వాసం ఉన్నందున గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓతో పాటు తహసీల్దార్ శ్రీనివాస శర్మ, కోదాడ, చిలుకూరు ఎంపీడీఓలు విజయశ్రీ, ఈదయ్య, కార్యదర్శి కావ్య, తదితరులు ఉన్నారు.